**కథానిక :**

# మా వారూ రచయితేనని నాకు గర్వం!

వాడ్రేవు శ్రీ జోగిపంతులుగారు

అన్నయ్య తను రాసిన కథలున్న పత్రికలన్నీ పంపేవాడు. అన్నయ్య రచన ఏదోవొకటి లేని తెలుగు పత్రికలు ఆ రోజుల్లో లేవంటే గొప్ప కాదు! అన్నయ్య రచనలు ఇతర పాఠకుడు చదివేటంత ఆసక్తితో చదివే దాన్ని కాను. సాధారణంగా ఒక రచయితతో పరిచయంవున్న పాఠకుడు—ఆ రచయిత ఎంత చక్కగా రాసినా అదోక విధమైన అసంతృప్తితో చదువుతాడు! చలంగారితో కానీండి, మరో రచయతతో కానీండి నాకు పరిచయం లేదు కాబట్టి, మా అన్నయ్యపంపిన పత్రికలలోవున్న ఇతర రచనలు ముందుచదివి, ఆఖరున-అదోక అసంతృప్తితో మాఅన్నయ్య రచన చదివేదాన్ని! ఒకరచయిత, తను కథకుణ్ణనిగానీ, వ్యాసకర్తననిగానీ ఎవరికీ-ఎక్కువగా పరిచయంవున్న వారికైనా సరే-తెలియకుండా చేసుకోడానికీ, తద్వారా న్యూనతను కొంత పోగొట్టుకోడానికి, మారు పేర్లు (పెన్ నేమ్) బాగా ఉపకరిస్తాయి! అంతే కాకుండా సంఘంలోని విద్రోహులను నిర్మొగమాటంగా విమర్శించడానికి ఈ మారు పేర్లు బాగా సహకరిస్తాయి. అందుచేత ప్రతి రచయిత ఒక 'పెన్ నేమ్' ఎంచుకోడం మంచిదనీ మా అన్నయ్య అప్పుడప్పుడు అనటం నాకు బాగా జ్ఞాపకముంది. ఎందుచేతనంటే ఆవ్యక్తి ఆ రచయిత అని పది మందిలో వుండగా చూసి, 'ఈ పెద్ద మనిషి కథలు రాస్తాడట!' అనీ, 'వ్యాసాలు రాసి దేశాన్ని వుద్ధరిస్తాడట!' అని ఆతనిలోని విజ్ఞతను ఏమాత్రం గమనించకుండా, న్యూనపరచడానికి ప్రయత్నిస్తాడు. ఇది నా స్వానుభవంమీద చెప్తున్నానని కూడా మా అన్నయ్య అనే వాడు. ఇది నిజమే, ఏమంటారా, 'క చ ట త ప'లో పర్వతాలు ఏడ్చినట్టు, తను రాయలేనందుకు ఏడవక, ఎదటి వాడు రాసి పైన్ అవుతున్నాడే అని ఏడుస్తారు కొందరు! రచయిత కావడం అంత బ్రహ్మాండమైన విషయం కాకపోయిన మాట వాస్తవమే! ప్రయత్నిస్తే వారూ కావచ్చు! ప్రయత్నించరు. ప్రయత్నించే వాణ్ణి చూస్తే ఏడుపు!

పగలెల్లా కాలేజీలో కొట్టుకుని కొట్టుకుని వచ్చాక ఈ తెగరాయటమనేది అన్నయ్యకి ఎట్లా సాధ్య పడేదా అని అనుకుంటుండే దాన్ని. ఎండాకాలపు సెలవులకి వస్తున్నానని వుత్తరము రాస్తూ "కథలురాసే మా అన్నయ్య వస్తున్నా"డని మటుక్కి టాం టాం చేయొద్దన్నాడు.

కాని మా అన్నయ్య కథలురాస్తాడని చెప్పుకోడంకంటె మరో ఘనత నాకేం కనబడలేదు!

అన్నయ్య వొచ్చిన నాలుగురోజులు దాకా వూళ్ళోవున్న పత్రికలవాళ్లూ, రచయితలూ తెగ వొచ్చారు! తను ఈ వూరు వొస్తున్నట్లు వాళ్ళ

కూడా వుత్తరాలు రాశాడు గావును! మా వూళ్ళోకూడా ఇంతమంది రచయిత లున్నారని నే నెప్పుడూ అనుకోలేదు! సెక్స్‌గురించి రాయమని సెక్స్ పత్రికల వారూ, జాతీయ జీవనం గురించీ, పీడిత ప్రజానీకం గురించీ రాసి యివ్వమని జాతీయ పత్రికలవాళ్లూ, బాల సాహిత్యం కథల్లో రాయమని పిల్లల పత్రికలవాళ్లు, చలన చిత్రకళా పురోభివృద్ధికి మార్గాలు సూచిస్తూ సీరియల్ వ్యాసాలు రాయమని సినీమా పత్రికల వారూ ఇలాగ రక రకాల పత్రికల వారు రక రకాల వ్యాసాలూ, కథలూ రాసివ్వమని వేధించుకుతిన్నారు. అందరికీ తలో వ్యాసం పంపుతానని హామీ యిచ్చి వదల్చుకున్నాడు.

అన్నయ్య భయపడినట్లు 'వీడూకూడా రచయితే నటోయ్!' అని ఎవ్వరూ అనలేదు. ఒక్క మా వారు తప్ప! 'ఇప్పటికే నా సత్యాన్ని గ్రహింప గలిగినందుకు ధన్య వాదాలు!' అన్నాడు అన్నయ్య. 'ఆయన' మరి మాట్లాడలేదు!

'నువ్వుకూడా రచన నేర్చుకో రాదూ?' అన్నాడు అన్నయ్య ఆయనతో. ఒక వెకిలినవ్వు నవ్వి వూరుకున్నారు. గట్టిగా పట్టుపట్టడం చేత సరే కానీయమన్నారు. వ్యక్తి పేరునిబట్టి ప్రచురించే పత్రికలు కొన్నీ, రికమెండేషన్ల వల్ల ప్రచురించే పత్రికలు కొన్ని ఏదో సమితి పేరు చూసి ప్రచురించే పత్రికలుకొన్ని వుండడంచాత పై విషయాలలో సంబంధంలేకుండా రచన విలువని గుర్తించే 'ఆంధ్రమహిళ' వంటి పత్రికలలో భావం మాత్రం చెప్పి ఆయనచేత రాయించేవాడు అన్నయ్య. ఆ సెలవల్లో కనీసం ఓ అర డజను రచనలన్నా రాయించాడు. ఇప్పుడు 'మాకు మీ రచన ముఖ్యావసరం!' అని ఆయనికి రోజూ వుత్తరాలు వచ్చేటంత పెద్ద రచయిత అయ్యారు! ఇంట్లో ఏ చిన్న సంఘటన జరిగినా నా పేరు కథలో కెక్కించి రాసేస్తారు! ఇప్పుడు మా అన్నయ్యే కాకుండా - మావారు కూడా రచయితేనని గర్వంగా చెప్పుకొంటాను! ఒప్పుకుంటారా?

ప్రఖ్యాతిగాంచిన ప్రశస్తమైన

మెహతా వారి

విశేష ఔషధములు

1. సుందరి ఎలిగ్జిర్ :—సమస్త ఋతు దోషములను పోగొట్టును, గర్భాశయరోగ అనుపమ నివారిణి.
2. ఫాస్ఫరస్ ఆయిల్ :—బాధ నివారణకు సాటిలేని తైలము.
3. మస్తానాపిల్సు :—సాధారణబలహీనత, కీళ్లనొప్పులు జ్వరములన్నిటికి అమోఘముగా పనిచేయును.
4. ద్రాక్షాసవము :—(బంగారము, మకరధ్వజము కలిసినది) రక్తమును శుద్ధిపరచునటువంటి, అజీర్ణము రూపుమాపునటువంటి బలవర్ధకౌషధము.

కెమిస్టులందరివద్ద దొరకును.

తయారు చేయువారు :

**K. S. MEHTA & CO.**

*250, China Bazar, Madras.*